క్లుప్తంగా

రక్తహీనత పట్ల అప్రమత్తంగా ఉందాం



రక్తహీనతపై కిషోర్‌బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

దెందులూరు: కిషోర్ బాలికలు రక్తహీనత కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం కొత్తగూడెం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర్ బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరికి అతి ముఖ్యమైన అంశాలన్నారు. వైద్య సిబ్బంది శాఖపరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంఎస్ కే శిరీష, ఏఎన్‌ఎం చాముండేశ్వరి, అంగన్‌వాడీలు ఝాన్సీ, మణి, ధనలక్ష్మి, వరలక్ష్మి ,కిషోర్ బాలికలు ఉన్నారు.

సారారహిత గ్రామంగా శీతాలం కొండేపాడు



రుణం చెక్కు అందిస్తున్న కలెక్టరు నాగరాణి

గణపవరం: మండలంలోని శీతాలం కొండేపాడు గ్రామాన్ని సారారహిత గ్రామంగా ప్రకటించినట్లు తాడేపల్లిగూడెం ఎక్సైజ్ ప్రొహిబిషన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ప్రకటించారని ఆమె తెలిపారు. నవోదయం 2.0 విజయవంతమైయిన సందర్భంగా జిల్లా కలెక్టరు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఎక్సైజ్ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించి గతంలో నాటుసారా అమ్మే ఎనిమిది మందిని గుర్తించి వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కోసం రూ.13 లక్షల రుణం చెక్కులను అందజేశారు.

జీలుగ సాగు ప్రారంభం



జీలుగ సాగు చేస్తున్న రైతు

దెందులూరు: వ్యవసాయ భూసాంద్రత పెరిగేందుకు పంట దిగుబడి సంతృప్తికరంగా వచ్చేందుకు జీలుగ సాగుపట్ల రైతాంగం ఆసక్తి చూపుతున్నారు. తొలకరి జల్లులు పడటం రైతాంగం జీలుగ సాగుకు పనులు ప్రారంభించారు. దీనికి తోడు జీలుగ విత్తనాలు సబ్సిడీపై రైతులకు సరఫరా కావడంతో దెందులూరు, సత్యనారాయణపురం, రామారావుగూడెం, శ్రీరామవరం గ్రామాల్లో జీలుగుసాగు పనులు ఊపందుకున్నాయి.

సైఫన్ నిర్మాణ పనులు ప్రారంభం



సైఫన్ పనులను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

దెందులూరు: దెందులూరులో సైఫన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సైఫన్ నిర్మాణం వల్ల దాదాపు 8 గ్రామాల రైతులు ప్రయాణికులకు వ్యవసాయ సామాజిక అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇరిగేషన్ అధికారులు శుక్రవారం సాయంత్రం నిర్మాణ పనులను పరిశీలించారు.

మట్టి నమూనాల సేకరణ వేగవంతం కావాలి

దెందులూరు: గ్రామ గ్రామాన మట్టి నమూనాల సేకరణ వేగవంతం కావాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు దెందులూరు మండలం వ్యవసాయ శాఖ అధికారి డ్రామా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సత్యనారాయణపురం, దెందులూరు గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది మట్టి నమూనా సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లోకి వచ్చి నమూనా సేకరణ సమయంలో రైతులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

సారా నిర్మూలనకు నవోదయం

పోలవరం రూరల్: సారా నిర్మూలనలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, ఎక్సైజ్ సీఐ వీరబ్రహ్మం ఆధ్వర్యంలో పోలవరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ సారా తయారీ విక్రయాలతో జీవనం సాగించేవారు నవోదయం 2.0 ద్వారా ప్రత్యామ్నయంగా ఉపాధి పొందేలా చర్యలు చేపడతామన్నారు. డీఆర్‌డీఏ పీఎం ఇ.అనిత, ఏపీడీ రాజబాబు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యులకు వేతన యాతన

- గౌరవ వేతనాలు అందక ఎదురు చూపులు
- జిల్లా కలెక్టర్‌ను కలిసి మొరపెట్టుకున్న వైనం



భీమడోలు మండల పరిషత్ కార్యాలయం



జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీకు వేతనాల కోసం ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు (ఫైల్)

ఉంగుటూరు : నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులకు నెలల తరబడి గౌరవ వేతనాలు అందక ఆందోళన చెందుతున్నారు. ఒకొక్క ఎంపీటీసీ సభ్యుడికి నెలకు రూ.3వేల చొప్పున సుమారు రూ.70 వేల వరకు ప్రభుత్వం బకాయి పడింది. రాష్ట్ర వ్యాప్తంగా, నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి పార్టీల ఎంపీటీసీ సభ్యుల కంటే వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులే ఎక్కువగా ఉండడంతో వారికి న్యాయబద్ధంగా అందాల్సిన గౌరవ వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. దీనితో వారి ఆవేదనను పట్టించుకోవడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హాయంలో ఎంపీటీసీ సభ్యులకు నెలకు రూ.3వేల చొప్పున గౌరవ వేతనం చెల్లించేవారు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత ప్రభుత్వం వేతనాలు చెల్లించలేకపోయింది.

వేతనాలు విడుదల చేయని ప్రభుత్వం

గత జూన్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ పెండింగ్ బకాయిలతో పాటు ప్రస్తుత నెలలకు గౌరవ వేతనాలు చెల్లించాల్సి ఉంది. వేతనాలు కోసం వారంతా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందిస్తున్నా వారికి స్పష్టమైన హామీ లేకపోవడంతో వారంతా గోడును ఎవరికి చెప్పాలో? అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. నిత్యం ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి వెళ్లి వాటిని పరిష్కరించే వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులంటే కూటమి సర్కార్ చిన్నచూపు చూస్తుందని, దీని వల్లే వేతనాలు పేరుకుపోవడానికి కారణమని వాపోతున్నారు. సంబంధిత మండల పరిషత్ అధికారులు వేతనాలు కోసం బిల్లులు పెట్టినా రాష్ట్ర స్థాయి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వాటిని వెనక్కి పంపుతుంది.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు

ఈనెల 12వ తేదీన ఏలూరులోని పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు వినతి పత్రం అందించారు. తమకు నెలల తరబడి వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తమకు వెంటనే విడుదల చేయాలని వారంతా కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పలు సార్లు అధికారులను కలిసి విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వారు ఫిర్యాదు చేశారు. దీనిపై మండల పరిషత్ అధికారులు 2023 మే నెలాఖరు వరకు ఎంపీటీసీల వేతనాలు ఇచ్చారని, ఆ తర్వాత విడుదల చేసిన గ్రాంట్లకు చేసిన బిల్లులను రాష్ట్ర ఫైనాన్స్ సంస్థ వెనక్కి పంపినట్లు వారు ఫిర్యాదుదారుడైన ఎంపీటీసీ సభ్యుడు ముళ్లగిరి జాన్సన్‌కు తెలిపారు. దీని బట్టి చూస్తే కూటమి సర్కార్ ఎంపీటీసీ గౌరవ వేతనాల మంజూరులో నిరంకుశత్వ ధోరణి అర్థమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నియోజకవర్గంలో ఎంపీటీసీ సభ్యుల వివరాలు

మండలం	ఎంపీటీసీ సభ్యుల సంఖ్య
భీమడోలు	20
ఉంగుటూరు	24
నిడమర్రు	15
గణపవరం	20

బాధ్యత అధికారులదే



ప్రజా సమస్యలను అధికారుల వద్దకు తీసుకుని వెళ్లి వాటిని పరిష్కరించేందుకు ప్రజలు మమ్మల్ని ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులకు వారి పదవిని బట్టి వారికి తగిన గౌరవ వేతనాలు అందించి గౌరవించడం ప్రభుత్వం, అధికారులు బాధ్యత. వారికి ఎప్పటికప్పుడు వేతనాలు ఇవ్వాల్సి ఉంది. జీతాలు ఇవ్వకుండా 20 నెలలుగా పెండింగ్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసం. గత ప్రభుత్వం సకాలంలో వేతనాలు, ప్రయాణ ఎలవెన్స్‌ను అందించింది.

– ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీ సభ్యుడు, భీమడోలు

చిత్తశుద్ధి లేదు



రాష్ట్ర ప్రపభుత్వం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల సభ్యులను చిన్నచూపు చూడడంలో అంతర్యమేంటి? మాకు రావాల్సిన వేతనాలు చెల్లించడానికి మేమే ప్రాధేయపడలా మహిళా ప్రజాప్రతినిధులుగా రాణించాలంటే ప్రభుత్వం తగిన సహకారం అందించాలి. కానీ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలంటేనే ఈ ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి లేదు. వేతనాల బిల్లులను కూడా మంజూరు చేయకుండా బిల్లులను వెనక్కి పంపడం ఆవేదనకు గురి చేస్తుంది. ఇకనైనా న్యాయబద్ధంగా రావాల్సిన మా వేతనాలు విడుదల చేయాలి.

– అంబటి దేవి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు, పోలసానిపల్లి

గ్రాంట్ విడుదలైతేనే వేతనాలు

ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలకు సంబంధించిన గ్రాంట్ విడుదల కాగానే వారికి వేతనాలను అందిస్తాం. 20 నెలలకు పైగా బకాయిలు ఉన్నా మాట వాస్తవమే. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. ఎంపీటీసీ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వానికి, అధికారులకు ఎంపీటీసీ సభ్యులంటే చిన్నచూపు ఉండదు. వారి సమస్యలను పరిష్కరించడమే మా బాధ్యత.

– సీహెచ్ పద్మావతిదేవి, ఎంపీడీఓ భీమడోలు

ఎయిడ్స్‌పై కళాజాత ప్రదర్శనలు



అవగాహన ప్రదర్శన చేస్తున్న కళాకారులు

దెందులూరు: ఎయిడ్స్, లెప్రసీ వ్యాధులపై సమాచార శాఖ కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. దెందులూరు మసీదుపాడు గ్రామాల్లో కీర్తన కల్చరల్ సొసైటీ సభ్యులు తిరుపతి కుమార్, సుబ్బారావు, శ్రీ దివ్య వాణి ప్రసాద్ కుమార్ కళాజాత బృంద సభ్యులు వైద్య శాఖ సిబ్బంది తో కలిసి ప్రజలకు ఐసిటిసి సెంటర్లు ఈఆర్‌టీ మందులు మొబైల్ ఐ సి టి సి కేంద్రాలు హెచ్ఐవి 20 17 యాక్ట్ వ్యాధులు లక్షణాలు నష్టాలు తీసుకోవలసిన జాగ్రత్తలు వైద్య శాఖ సౌకర్యాలను ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా తిరంగా యాత్ర



తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం: భారతదేశం రుణం తీర్చుకోవడం మనందరి బాధ్యత అని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏపీ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం సాయంత్రం గణపవరంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా తిరంగాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని ఉగ్రవాద దేశాలు ఏకమైనా భారత్‌ను ఏమీ చేయలేవని అన్నారు. గణపవరం పోలీస్‌ఐలెండ్ సెంటర్ నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ జైభారత్, జైజై మోదీ నినాదాలు చేస్తూ ప్రదర్శన జరిపారు. కార్యక్రమంలో శరణాల మాలతీరాణి పాల్గొన్నారు.

రేపు ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ

దెందులూరు: దెందులూరులో ఈ నెల 18న ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ జరుగుతుందని నిర్వహిస్తున్నట్లు దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి, ఎంపీడీవో కే శ్రీదేవి అన్నారు. శుక్రవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ భారత సైన్యం ఆపరేషన్ సింధూరం యుద్ధాన్ని విజయవంతంగా ముగించి నందుకు ప్రభుత్వ ఆదేశాలు మేరకు దెందులూరు నియోజకవర్గం లో నాలుగు మండలాలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు డివిజనల్ అధికారులు మాజీ సైనికులు ప్రజాప్రతినిధులు ఈ విజయోత్సవ ర్యాలీలో పాల్గొనాలన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ర్యాలీ సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమవుతుందని తహసీల్దార్ సుమతి ఎంపీడీవోకే శ్రీదేవి వివరించారు.

ఉంగుటూరు ఏఎంసీ వైస్‌చైర్మన్‌గా కూనసాని

గణపవరం: గణపవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు కూనసాని నాగేశ్వరరావును ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాగేశ్వరరావును టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, బీసీ విభాగం కార్యదర్శి యాళ్లసుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు తదితరులు అభినందించారు.

డెంగీ నివారణపై అవగాహన అవసరం



ర్యాలీ చేస్తున్న గణపవరం పీహెచ్‌సీ సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: డెంగీ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉంటే ఆ వ్యాధి బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.ఓంకార్‌నాథ్, పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది డెంగీవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమలద్వారానే వ్యాప్తి చెందుతుందని, అందువల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగునీటి గుంటలతో పాటు వృథా నీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. వారానికి ఒకరోజు డ్రైడేగా నిర్వహించాలని, దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జాలాది విల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పిప్పర పీహెచ్‌సీలో..

దోమలు పుట్టరాదు, దోమలు కుట్టరాదు అన్న నినాదంతో ప్రజలు దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలని, అప్పుడే డెంగీ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది డెంగీపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. మురుగునీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని అందువల్ల దోమలను లార్వా దశలోనే నిర్మూలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

దెందులూరు: డెంగీపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వ్యక్తిగత పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ చైతన్య కృష్ణ అన్నారు. శుక్రవారం పోతునూరు గ్రామంలో బస్టాండ్ సెంటర్, సచివాలయం సెంటర్, రామాలయ సెంటర్‌లో ప్లకార్డులను పట్టుకుని డెంగీపై అవగాహన కల్పించారు. ర్యాలీలో ఎంపీహెచ్ఓ హరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

గోపన్నపాలెంలో..

గోపన్నపాలెంలో డెంగీపై అవగాహన ర్యాలీ జరిగింది. శుక్రవారం వైద్యాధికారులు డాక్టర్ రాకేష్, ఎంపీహెచ్ఈఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ఫ్లెక్సీలు చేత పట్టుకుని డెంగ్యూ పై అవగాహన కల్పించారు. పాత సినిమా హాల్ రోడ్డు, బస్టాండ్ సెంటర్, మసీదుపాడు క్రాస్ రోడ్డు, హైస్కూల్ రోడ్డులలో ర్యాలీ జరిగింది.

19న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ఏలూరు (టూటౌన్): పేదలకు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 11.00 గంటలకు ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ దశలవారీగా అర్జీలు నమోదు చేయించినట్లు తెలిపారు. ఈ అర్జీలను పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

ఉద్యోగం పేరుతో మోసం

ఏలూరు టౌన్: ఏలూరుకు చెందిన ఒక వ్యక్తిని సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఒక అపరిచిత వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. అతని వద్ద రూ.5 లక్షలు కాజేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఏలూరు వన్‌టౌన్ తూర్పువీధికి చెందిన షణ్ముఖ శ్రీ వెంకట దుర్గాసాయికి ఆన్‌లైన్ లో గోవింద్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ప్రతిరోజూ ఇద్దరూ ఫోనులో చాటింగ్ చేసుకునేవారు. తనకు సాఫ్ట్ వేర్ కంపెనీ ఉందని పలువురికి ఉద్యోగాలు ఇచ్చానని గోవింద్ మాట్లాడుతూ దుర్గా సాయి ని నమ్మించాడు. ఇదే క్రమంలో మరో నలుగురిని ఆన్‌లైన్‌లో పరిచయం చేశాడు. వారంతా తాము గోవింద్ వద్ద ఉద్యోగాలు పొందా మని నమ్మించారు. ఆ మాటలు నమ్మిన దుర్గా సాయి తనకు, తన భార్యకు సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు కావాలని కోరాడు. ఉద్యోగాల కోసం గోవింద్ రూ.5 లక్షలు డిపాజిట్ కట్టాలని చెప్పటంతో బాధితుడు డబ్బులు గోవింద్ అకౌంట్‌కు ఆన్‌లైన్‌లో జమ చేశాడు. డబ్బులు అందగానే గోవింద్ ఇక అందుబాటులో లేకుండాపోయాడు. దీంతో బాధితుడు ఏలూరు వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హాస్టల్ భవనాల పరిశీలనకు ప్రత్యేక కమిటీ

ఏలూరు(మెట్రో): జిల్లాలో శిథిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల భవనాల పరిస్థితిని పరిశీలించడానికి కమిటీని నియమిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్ మరమ్మతులు, అభివృద్ధి పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. కమిటీ నివేదిక ఆధారంగా వసతి గృహ భవనాల పునర్నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మంచి వసతి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వేసవి సెలవులు ముగిసే నాటికి పనులు పూర్తిచేయాలని సంబంధిత శాఖల ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ ఎం ముక్కంటి, సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్, వివిధ శాఖల ఇంజినీర్లు, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛత, పచ్చదనంపై అవగాహన కల్పించాలి

ఏలూరు(మెట్రో): స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మే నెలలో వేడిని ఓడించండి ఇతివృత్తానికి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ఈనెల 17వ తేదీ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ నిర్వహణపై అధికారులతో ఆమె సమీక్షించారు. వేడి ప్రభావాలను తగ్గించడానికి ప్రజల్లో అవగాహన పెంచేందుకు శనివారం పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పిల్లల్లో వాతావరణంపై అవగాహన పెంపొందించడానికి బీట్ ది హీట్ అనే ఇతివృత్తంపై డ్రాయింగ్, వ్యాచరచన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. నీటిని సంరక్షించడానికి కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలో వర్షపు నీటిని సంరక్షణ నిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. వృద్ధులు, పిల్లలు, కార్మికులు, బహిరంగ కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పని ప్రదేశాలు, కాలనీలు, ఇతర నిర్మాణ పనుల ప్రాంతాల్లో చలివేంద్రాలు, షెడ్ నెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. బస్సు స్టాపేలు, రైల్వేస్టేషన్లు, మతపరమైన ప్రదేశాలు, మార్కెటు ప్రాంతాల్లో షెడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, సీపీఓ వాసుదేవరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, డీసీహెచ్ఎస్ పాల్ సతీష్ కుమార్, జిల్లా వైద్య శాఖ అధికారి ఆర్ మాలిని, డీఈఓ కె.వెంకట లక్ష్మమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా, ఉద్యానవన శాఖ డీడీ ఎస్.రామ్మోహన్, ఇరిగేషన్ ఎస్సీ నాగార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వరరావు, పరిశ్రమల శాఖ డీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

- శుచి, శుభ్రతలు పాటించని హోటళ్లు
- ఇష్టానుసారం ఆహార పదార్థాల విక్రయాలు
- మిగిలిపోయిన వెజ్, నాన్‌వెజ్ వంటకాల నిల్వ చేసి అమ్మకాలు
- లాభార్జనే ధ్యేయంగా వ్యాపారం



హోటళ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

దెందులూరు : వేడి, వేడి, రంగు రంగుల ఆహార పదార్థాలు నోరూరిస్తాయి. పొగలు కక్కుతూ, ప్లేట్‌లో కనిపిస్తే తినేయాలనిస్తాయి. వెజ్, నాన్‌వెజ్ డిష్‌లన్నీ హోటళ్లలో ఆకట్టుకునేలా ఉంటాయి. కానీ వాటి వెనుక పరిశీలిస్తే అనారోగ్యమే కనిపిస్తోంది. కిచెన్‌లోకి వెళ్లి గమనిస్తే ఒళ్లు జలదరింపజేసే నిజాలు వెలకివస్తాయి. అపరిశుభ్రత, ఆరోజు మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వ చేసి తర్వాత సాగించే అమ్మవాలు, వాడేసిన నూనెను మళ్లీమళ్లీ వాడి వండుతున్న వంటలు ఇలా ఎన్నో ఉన్నాయి. మనుషుల ఆరోగ్యంతో హోటళ్ల యజమానులు ఆడుకుంటున్నారు. నాణ్యతను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వంటకాలు విక్రయించి అనారోగ్యపాలు చేస్తున్నారు. వాటిని గమనించి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నిల్వ పదార్థాల విక్రయం

మండలంలో వందకుపైగా, వెజ్, నాన్ వెజ్ హోటళ్లు ఉన్నాయి. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం డిన్నర్ వరకూ రకరకాల ఆహారాన్ని అందిస్తున్నాయి. అయితే వీటిలో పేరుపడిన హోటళ్లు కూడా మిగిలిపోయిన ఆహారాన్ని నిల్వ చేసి తర్వాత అందిస్తున్నట్లు అధికారులు దాడుల్లో బహిర్గతమయ్యింది.

బిర్యానీ, చికెన్..ఎప్పటివో?

రాత్రి మిగిలిపోయిన బిర్యానీ, చికెన్‌ను మరుసటి రోజు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధలనలు ప్రకారం వాటిని మరుసటి రోజు విక్రయించకూడదు. కేవలం పచ్చి మాంసం, నిర్ణీత టెంపరేచర్‌లో ఉంచుకోవాలి. కానీ హోటల్ వాళ్లు సాధారణ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మరీ మాంసం వరుసటి రోజు వినియోగదారులకు వండి విక్రయిస్తున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



కలుషిత ఆహారం తినడం వల్ల అనారోగ్యం పాలవడం తప్ప దు. బయట హోటల్‌కి వెళ్లే, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌వద్ద తీసుకొ నే ఆహారంపై దృష్టి సారించాలి. ముఖ్యంగా మాంసాహారంలో రంగులు కలపడంవల్ల క్యాన్సర్ వస్తుంది. వంటల్లో వాడే ఫుడ్ కలర్, నిల్వ ఉంచిన మాంసం తినడంవల్ల అనేక రకాలైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ పవన్, వైద్యాధికారి దెందులూరు సీహెచ్‌సీ

ఏటీఎం పనిచేయకపోవడంతో అవస్థలు

ఉంగుటూరు: ఉంగుటూరులో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు చెందిన ఏకైక ఏటీఎం కేంద్రం పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు నెలల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉందని ప్రజలు వాపోతున్నారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, ప్రజలు, రైతులు, వ్యాపారులు అంతా ఏటీఎం సేవలు అందకపోవడంతో నారాయణపురం వెళ్లి సొమ్ము విత్‌డ్రా చేసుకుంటున్నారు. ఏటీఎంకు రిపేరు రావడంతో కొత్త ఏటీఎం వచ్చిందని, ఆ మెషీన్ లోనూ సాంకేతిక లోపం ఏర్పడడంతో కొత్త మెషీన్ ఏర్పాటు జాప్యం జరిగిందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.